క్లుప్తంగా

సంపరలో కార్తిక వనసమారాధన



ముక్తేశ్వరస్వామి ఆలయం వద్ద వనసమారాధనలో పాల్గొన్న భక్తులు

పెదపూడి: కార్తిక వన సమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వీక్షణ ముక్తేశ్వర స్వామి ఆలయం వద్ద 31వ కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్, గ్రామ యువకులు, పెద్దలు అధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సంపర గ్రామంతో పాటు కాంద్రేగుల, చింతపల్లి, పుట్టకొండ గ్రామాల నుంచి సుమారు 5 వేల మంది భక్తులు వన సమారాధనలో పాల్గొన్నారు. గ్రామానికి విశేషంగా సేవలందించిన దాత మల్లిపూడి శ్రీనివాసరావును ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ నాగిరెడ్డి వీరస్వామి, నాయకులు తిబిరిశెట్టి ఆదినారాయణ, వనసమారాధన కమిటీ అధ్యక్షుడు వడ్డీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న స్వాములు

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నెలంతా స్వామివారి సన్నిధిలో అన్నసమారాధనలు, దీపోత్సవాలు జరుపుతున్నారు. దీనిలో భాగంగా పశ్చిమగానుగూడెం సర్పంచ్ దేవిక, టీడీపీ నాయకుడు రొంగల శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే రాత్రి దేవస్థానంలోని మెట్లపైనా, ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పెందుర్తి అభిరామ్, సుంకర శ్రీను, కర్రి వీర గణేష్ తదితరులు పాల్గొన్నారు.

525 క్యూసెక్కుల నీరు విడుదల

సీతానగరం: మెట్ట ప్రాంత పొలాలకు 525 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ డీఈ కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం-2 నుంచి ఒక మోటారు ద్వారా 175 క్యూసెక్కులు, అలాగే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి ఒక మోటారు ద్వారా 350 క్యూసెక్కులు వదిలామన్నారు. గోదావరి నీటిమట్టం 14.6 మీటర్లు ఉందన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



కోరుకొండలో వెంకటరమణ చౌదరికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మధురపూడి: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్‌గా నియమితులైన బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదివారం కోరుకొండలో లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు రాజానగరం నుంచి ప్రదర్శనగా కోరుకొండ వచ్చారు. ఆయనకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకటలక్ష్మి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి వెంకటరమణ చౌదరి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు అధ్వర్యంలో ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.



పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

రబీకి రెడీ..

- మెట్ట రైతుల సన్నద్ధం
- పొలాలను సిద్ధం చేస్తున్న వైనం
- సాగులో ఎప్పుడూ వీరిదే ముందంజ

రాజానగరం: జిల్లాలో ఒకవైపు ఖరీఫ్ వరి పంట కోతలు ఇంకా పూర్తి కాలేదు. కానీ మెట్ట ప్రాంతంలోని రాజానగరం మండలం నరేంద్రపురం, కలవచర్ల, వెలుగుబంద, తూర్పుగానుగూడెం మున్నగు ప్రాంతాలలో రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ ప్రాంతంలో 20 రోజుల క్రితమే ఖరీఫ్ వరి పంట కోతలు ప్రారంభించి, దాదాపుగా పూర్తికావొస్తున్నాయి. ఈ తరుణంలో ప్రతి సీజన్‌లోను ముందంజ వేసే ఇక్కడి రైతులు ఈసారి కూడా అదే ఫార్ములాతో అడుగులు వేస్తున్నారు.

భూగర్భ జలాల సాయంతోనే..

పై ప్రాంతంలో భూగర్భ జలాల సాయంతోనే అన్నదాతలు ప్రతి సీజన్‌లో ముందంజ వేస్తున్నారు. సాగు నీటి సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ బోర్ల సాయంతో పంటలు పండించడం ఇక్కడ పరిపాటి. ఈ నేపథ్యంలో ఖరీఫ్ కోతలు పూర్తయిన వెంటనే పొలాలను రబీ సాగుకు సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ప్రతి ఏటా రబీలో సాగు చేసే ఆర్‌ఎన్నార్ వరి వంగడాలతో పాటు అదే మాదిరిగా ఉండే 1198, గణేష్, 999 వంటి సన్నరకాలతో నారుమడులు కడుతున్నారు.

స్వల్పకాలిక రకాల సాగు

సాధారణంగా 150 రోజులలో పంట కోతకు వచ్చే వంగడాలను కాకుండా 120 రోజుల్లోనే కోతకు వచ్చే స్వల్పకాలిక రకాలు ఈ ప్రాంతంలో రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఇది కూడా సాగులో అందరి కంటే ముందుండటానికి ఒక కారణంగా చెప్పవచ్చు. నార్లు వేయడానికి మడులు కట్టడం, ఎంచుకున్న విత్తనాలను చల్లడంతోపాటు నాట్లు వేసేందుకు వీలుగా పొలాలను దమ్ములు చేయడం కూడా ప్రారంభించారు.

ప్రణాళికాబద్ధంగా..

ఈ ప్రాంతంలో రైతులు ఒక ప్రణాళికాబద్ధంగా వరి పంటను సాగు చేయడం కూడా సాగులో ముందంజ వేయడానికి మరొక కారణంగా వ్యవసాయాధికారులు సైతం అంగీకరించడం విశేషం. ఏ సీజన్‌లోనైనా పంట కోతలు పూర్తయిన తరువాత పొలాలను ఖాళీగా ఉంచకుండా తదుపరి పంటకు సిద్ధం చేసుకుంటారు. తక్కువ కాలంలో మంచి దిగుబడులు సాధించే దిశగా వరి వంగడాలను ఎంచుకోవడంలో వీరి ఆలోచనే ప్రత్యేకంగా ఉంటుంది. దీని వల్ల ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల బెడదల నుంచి కూడా చాలా వరకు తప్పించుకోగలుగుతున్నారు. అంతేకాక అందరి కంటే ముందుగా కోతలు ప్రారంభించడంతో నేరుగా మిల్లర్లు కొనుగోలు చేయడంతోపాటు మంచి ధర కూడా లభిస్తుంది.



సిద్ధమవుతున్న నారుమడి

సాగులో మెట్ట రైతుల ముందంజ



వరి పంట సాగులో సీజన్ ఏదైనా మెట్ట రైతులు ముఖ్యంగా నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, వెలుగుబంద ప్రాంతాల రైతులు ప్రతిసారీ ముందంజలోనే ఉంటారు. ఎందుకంటే ఇక్కడ సాగు చేసే రైతులలో ఎక్కువ మంది కౌలు రైతులు కావడం వలన నిరంతరం వారి ఆలోచనలు వ్యవసాయం మీదనే ఉంటాయి. వ్యవసాయం ఎప్పటికప్పుడు వచ్చే ఆధునిక పద్ధతులను అధ్యయనం చేయడంతో పాటు ఆచరిస్తుంటారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ ముందడుగు వేస్తుంటారు.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

అనపర్తి వైద్యాధికారికి అరుదైన గుర్తింపు



చెన్నైలో ఎఫ్‌సీఎంఏ డిగ్రీ అవార్డు అందుకుంటున్న రామగురెడ్డి

పెదపూడి: అనపర్తికి చెందిన ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ తాడి రామగురెడ్డి ఎఫ్‌సీజీపీ, ఎఫ్‌సీఎంఏ డిగ్రీలు అందుకున్నారు. చెన్నైలో శనివారం జరిగిన 'ఐకాన్ 2024' లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.వి.అశోకన్ చేతుల మీదుగా 'ఫెలోషిప్ ఇన్ కాలేజీ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనరీస్'(ఎఫ్‌సీజీపీ) అవార్డు అందుకున్నట్లు ఆయన చెప్పారు. చెన్నైలోనే ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జేఏ జయపాల్ చేతుల మీదుగా 'ఫెలోషిప్ ఆఫ్ ది కామన్ వెల్త్ మెడికల్ అసోసియేషన్'(ఎఫ్‌సీఎంఏ) డిగ్రీ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. సుమారు 20 ఏళ్లుగా వైద్య వృత్తిలో పనిచేసిన వారు ఈ డిగ్రీలు, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తాను అందించిన ఉత్తమ సేవలను గుర్తిస్తూ ఈ అవార్డులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

కనువిందు



దుక్కు చేసిన పొలంలో పురుగుల కోసం వాలిన పక్షులు

రాజానగరం: మెట్ట ప్రాంతంలో కొందరు రైతులు అపరాల సాగు కోసం తమ పొలాల్లో ట్రాక్టర్లతో దుక్కులు చేస్తున్నారు. ఈ సందర్భంగా భూమి నుంచి బయటకు వచ్చే పురుగులను తినేందుకు కొంగలు పెద్ద సంఖ్యలో అక్కడకు వస్తున్నాయి. దుక్కులు చేసిన పొలంలో తెల్లని పుష్పాల్లా కనిపిస్తున్నాయి. ఒకటి కాదు, రెండు కాదు వేల సంఖ్యలో అక్కడకు తరలివస్తున్నాయి. వాటికి విందు లభిస్తోంది. చూసే వారికి కనువిందు కలుగుతుంది.

ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన



కమిషనర్ కేతన్ గార్గ్‌తో సమావేశమైన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం రూరల్: ఫీల్డ్ స్టడీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 11 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఆదివారం నగరంలో పర్యటించారు. ముందుగా వారికి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగే వివిధ కార్యక్రమాలను కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. అనంతరం ట్రైనీ అధికారులు కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, సిబ్బందితో మాట్లాడి వారి విధుల గురించి తెలుసుకున్నారు. తదుపరి బోర్డు రూములో అన్ని విభాగాల అధిపతులతో సమావేశమయ్యారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నగరపాలక సంస్థ నిర్వహించే కార్యక్రమాలను సంబంధిత అధికారులు వివరించారు. ఆ తర్వాత సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను సందర్శించారు. అక్కడి నుంచి ఇన్నీసుపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులకు శిక్షణ



సమావేశంలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ: ఇసుక సరఫరా విధానంలో రిజిస్టర్ బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. ఇసుక లావాదేవీలపై ప్రభుత్వ మార్గదర్శకాలు, చేయాల్సిన, చేయకూడని పనులు తదితర అంశాలపై 90 మంది బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులకు ఆదివారం ఆర్డీవో కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిర్మాణ పనులకు అంతరాయం కలగకుండా వినియోగదారులకు ఇసుకను విరివిగా అందించడానికి బోట్స్‌మెన్ సొసైటీలు మరింతగా తవ్వకాలు చేపట్టాలన్నారు. సొసైటీల బ్యాంకు ఖాతాలకు ఇకపై తవ్వకాల చెల్లింపులు నేరుగా జరుపుతారన్నారు. ప్రతి రీచ్ లో కనీసం వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వాలని సూచించారు. ఇసుక సరఫరా, లావాదేవీల విషయంలో సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఈ రోజు సమావేశం నిర్వహించామన్నారు. రీచ్‌ల వద్ద క్యూలైన్లు, రికార్డుల నిర్వహణ, లోడింగ్, పర్యవేక్షణ తదితర విషయాలలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ట్రాక్టర్ల ద్వారా ఓపెన్ రీచ్ పాయింట్ల ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచామన్నారు. వీటికి సంబంధించి పభుత్వానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, మైన్స్ అధికారి విఘ్నేష్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ అధికారి సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం క్వారీ మార్కెట్ సెంటర్‌లోని దీన్ దయాళ్ కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైందవ శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం నగర బాధ్యతలను ప్రకటించారు. కార్యక్రమంలో విభాగ కన్వీనర్ రిమ్మలపూడి సుబ్బరాజు, ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ ప్రచారక్ సోమశేఖర్, నగర కన్వీనర్ అనంత, నగర సహ కన్వీనర్ బొమ్ముల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో దాడి

రాజమహేంద్రవరం రూరల్: బీరు బాటిల్‌తో దాడి చేసిన ఘటనపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. తాడితోటకు చెందిన అంజూరి విజయ కుమార్ టీవీఎస్ షోరూమ్ వెనుక ప్రాంతంలో మద్యం తాగుతున్నాడు. అక్కడే మరి కొందరు అదే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వారిలోని ఒకరితో విజయ కుమార్‌కు మాటామాటా పెరిగింది. దీంతో అతడు బీరు బాటిల్ తో విజయ కుమార్‌పై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి

సీటీఆర్ఐ: శెట్టిబలిజ సామాజిక వర్గీయుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కుడుపూడి సత్తిబాబు అన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ కార్పొరేషన్ ద్వారా సంఘీయులకు రాయితీలు వచ్చేలా చేస్తానన్నారు. ఈ సందర్భంగా గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, ఈడిగ యాత సంఘం గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాసరావు, అధ్యక్షుడు రెడ్డి రాజు, గౌరవ సలహాదారు గెద్దాడ హరిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి సూరంపూడి శ్రీహరి, బుడ్డిగ రవి ఆయనకు అభినందనలు తెలిపారు.

జోరుగా.. హుషారుగా..

- ఉత్సాహంగా వనసమారాధనలు
- తరలివచ్చిన సంఘీయులు



రౌతు సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న తూర్పుకాపు సంక్షేమ సంఘ ప్రముఖులు



పద్మశాలీయ వన సమారాధనలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: తూర్పుకాపుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శాటిలైట్‌సిటీలోని జీవీఎస్ అప్పలరాజుతోటలో తూర్పుకాపు సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఆదివారం మొదటి కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఆల్ ఇండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ నా యుడు, రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల అప్పలసూరి నాయుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి హాజరయ్యారు.

- చెరుకూరి గార్డెన్స్‌లో ఆదివారం పద్మశాలీయ సంక్షేమ సేవాసంఘం కార్తిక వనసమారాధన వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి సుమారు 10 వేలకు పైగా సంఘీయులు తరలి వచ్చారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పలువురు నాయకులు, నగర ప్రముఖులు విచ్చేశారు. శాశ్వత రాజగురువు ఆమంచి ఆంజనేయ గురుస్వామి, అధ్యక్షుడు బత్తుల నరసింహమూర్తి, గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల రమేష్‌బాబు పాల్గొన్నారు.
- కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడుతూ ఏటా అందరితో కలిసి వనసమారాధన జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి పాల్గొన్నారు.
- రాజమహేంద్రవరం మున్సిపల్ హైస్కూల్ 1985–86 పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక, కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. పిడింగొయ్యి – కవలగొయ్యి మధ్య ఉన్న రమేష్ తోటలో నిర్వహించారు.

రాజమహేంద్రవరం సిటీ: కుల మతాలకు అతీతంగా జరుపుకొనే కార్యక్రమమే కార్తిక వన సమారాధన మహోత్సవమని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. సంపత్ నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఆదివారం వనసమారాధన నిర్వహించారు. డాక్టర్ కర్రి రామారెడ్డి , ఓఎన్జీసీ విశ్రాంత అసెట్ మేనేజర్ డీఎమ్ఆర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీటీఆర్ఐ: కార్తిక మాసంలో సామూహికంగా భోజనం చేయడం జాతి ఐక్యతను తెలియచేస్తుందని కాంగ్రెస్ సీడబ్ల్యూసీ మెంబర్ గిడుగు రుద్రరాజు అన్నారు. నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి కళాశాలలో ఆదివారం కార్తిక వనసమారాధన జరిగింది. నగర సంఘ అధ్యక్షుడు దుర్వాసన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరిస్తున్న విశ్వేశ్వరరెడ్డి



వనసమారాధనలో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు



సమ్మేళనానికి హాజరైన మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



పీవీ నరసింహారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రుద్రరాజు తదితరులు

బాధిత కుటుంబానికి నిత్యావసరాల వితరణ



బాధితురాలికి నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: సింగవరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన చిట్రోతు సీతారత్నానికి జక్కంపూడి రామ్మోహన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేయూత అందించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు చిర్ల పోశియ్య, మట్ట శ్రీనివాస్ తదితరులు జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ అందించిన వంట సామగ్రి, బియ్యం, నిత్యావసర సరకులు వితరణ చేశారు. సీతారత్నం కుటుంబానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. బాధితురాలికి పార్టీ నాయకుడు మట్ట శ్రీనివాస్ ఆర్థిక సాయం చేశారు.

సారా తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన దేవరకొండ శ్రీనివాస్, యరసాని వెంకన్నలకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై డి.రామ్ కుమార్ ఆదివారం తెలిపారు. మోటారు సైకిల్‌పై సారా రవాణా చేస్తున్న వీరిద్దరినీ బొబ్బిల్లంక శివారున అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 30 లీటర్ల సారా, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారన్నారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురంలో పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.16,340, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణాల మహాయజ్ఞం



కల్యాణంలో పాల్గొన్న చింతా సత్యనారాయణరెడ్డి, శ్రీధర్‌వర్మ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు విద్యుత్ ప్రాంగణంలోని సంతాన సీతారామాలయం (బొమ్మూరు భద్రాద్రి)లో శనివారం రాత్రి అమ్మఒడి సేవాతరంగిణి ఆధ్వర్యంలో 108 ఉచిత శ్రీనివాస కల్యాణాల మహాయజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ విశ్రాంత ఎస్ఈ చింతా సత్యనారాయణరెడ్డి, రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ వర్మ దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన హిందూ చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజిక్ వైకే.శ్రీనివాస్ మాట్లాడుతూ 108 ఉచిత శ్రీనివాస కల్యాణముల మహాయజ్ఞం విశిష్టతను వివరించారు.

ధవళేశ్వరంలో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

ధవళేశ్వరం: ధవళేశ్వరం ఐటీసీఎల్ కాలనీలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బలగాలు ఈ కార్యక్రమం చేపట్టాయి. ఐటీసీఎల్ కాలనీ బ్లాక్‌లలో ఉంటున్న కొందరు అనుమానితులను ఫింగర్ ప్రింట్ డివైజ్ ద్వారా చెక్ చేసి అదుపులోకి తీసుకున్నారు. సరైన పత్రాలు లేని 18 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాలకు పాల్పడే వారికి ఆశ్రయం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ధవళేశ్వరం సీఐ టి.గణేష్, రాజమహేంద్రవరం టూటౌన్ సీఐ దుర్గారావు, కడియం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు హరిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 16 ఏళ్ల తన కుమార్తె కనిపించడం లేదని రాజేంద్రనగర్‌కు చెందిన జి.ప్రసాద్ ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బాలిక ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఈ మేరకు ఏఎస్సై నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరం

కడియం: దుళ్ల మార్కెట్ సెంటర్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చొప్పన సత్తిబాబు, చందన సత్తిబాబు, తొట్టి సత్తిబాబు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.